క్లుప్తంగా

నేడు, రేపు వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

చింతూరు/అడ్డతీగల: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అధ్యక్షతన మండలంలోని నూనెవారి గూడెంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు తెలిపారు. నూనెవారిగూడెంలో ఉదయం 10గంటలకు చింతూరు, వీఆర్ పురం మండలాల నాయకులతో, నంది గామలో మధ్యాహ్నం 2గంటలకు ఎటపాక, కూనవరం మండలాల నేతలతో సమావేశం జరగనున్నట్టు పేర్కొన్నారు. అదే విధంగా అడ్డతీగలలో ఆదివారం ఉదయం పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం జరుగుతుందని అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కూనవరం: మండలంలోని టేకులబోరు అంగన్‌వాడీ కేంద్రం–2లో శుక్రవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఐసీడీఎస్ నాగమణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్ వనజాక్షి, ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న శివయ్య

గూడెంకొత్తవీధి: ప్రతీ ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించాలని నియామవళి అధికారి, డ్వామా పీడీ శివయ్య సూచించారు. ఎంసీసీపై నోడల్ అధికారిగా ఉన్న ఆయన శుక్రవారం గూడెంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎవరు రాజకీయ నేతలతో కలిసి తిరగొద్దని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవద్దన్నారు. వలంటీర్లు వాటికి దూరంగా ఉండాలని సూచించారు ఎవరు కోడ్‌ను ఉల్లంఘించినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసర సరకుల పంపిణీ


నిత్యావసర సరకులు అందిస్తున్న ముస్లిం కమిటీ సభ్యులు

చింతపల్లిరూరల్: ముస్లిం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్థానిక ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ విశాఖకు చెందిన జమాతే ఇస్లాం హింద్ ఆయా సరకులను సమకూర్చినట్టు చెప్పారు. కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా, మజీద్ ఇమామ్ ఎండీ ముజీబ్, కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, ఉప సర్పంచ్ నూరు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి సాగు



మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరి సాగు ఆశాజనకంగా ఉంది. మండల వ్యాప్తంగా 82 హెక్టార్ల మేర వరి సాగు జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, మునగపాక తదితర ప్రాంతాల్లో వరి పైరు కోత దశకు చేరుకుంటోంది. వరి పైరు విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- నియోజకవర్గ వ్యాప్తంగా 304 పోలింగ్ కేంద్రాలు
- 135 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన
- అరకు రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



సాక్షి ఇంటర్వ్యూ

అనంతగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అరకు నియోజకవర్గంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అరకు అసెంబ్లీ పరిధిలోని ఆరు మండలాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఆ వివరాలు..

ఆరు మండలాల్లో 2,43,250 మంది ఓటర్లు

నియోజకవర్గంలో ఉన్న అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని 2,43,250 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు–1,18,348 మంది, స్త్రీలు–1,24,895 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. 2019 ఎన్నికల్లో 303 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుత ఎన్నికల్లో కొత్తగా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ కొరపర్తిలో అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటుతో వాటి సంఖ్య 304కు పెరిగింది. ఎన్నికల కోడ్ అమలుకాక ముందే ప్రతి మండలంలో ఈవీఎం, వీవీ ప్యాడ్‌ల వినియోగం. ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం.

54 మంది సెక్టోరల్ అధికారులు

నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాల పరిధిలో 54 మంది సెక్టోరల్ అధికారులను నియమించాం. వీరికి రెండు సార్లు శిక్షణ ఇచ్చాం. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, బెంచీలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్, వృద్ధులకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు ఏఆర్వోలకు ఆదేశాలిచ్చాం.

రెండు స్ట్రాంగ్ రూమ్‌లు

అరకులోయ తహసీల్దార్ కార్యాలయంలో రెండు స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటుచేశాం. అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించి ఎన్నికల సామగ్రి భద్రపరిచేందుకు వీటిని ఉపయోగిస్తాం. స్ట్రాంగ్ రూమ్ చుట్టూ రూ. 40 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నాం. కొద్ది రోజుల్లో పనులు పూర్తి చేస్తాం. ఎన్నికల అనంతరం పాడేరులోని సుండ్రుపుట్టు వద్ద డిగ్రీ కళాశాలలోని ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలను భద్రపరుస్తాం. ఇందుకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాం.

మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు

ఎన్నికల్లో నగదు, మద్యం అక్రమ రవాణా నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. దీనిలో భాగంగా జిల్లా బోర్డర్ సరిహద్దు అయిన అనంతగిరి మండలం చిలకలగెడ్డ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశాం. అంతేకాకుండా ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు సరిహద్దు ప్రాంతంలో ఒకటి, డుంబ్రిగుడ మండలం ఒడిశాకు చెందిన చటువా సరిహద్దు వద్ద మరో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి, 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. రూ. 50 వేలకు మించి, ఎక్కువ నగదు తరలిస్తే, చట్టపరంగా సీజ్ చేస్తాం.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

గిరిజన ప్రాంతంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 25 ఉండగా, ఇవి కాకుండా పోలీసులు మరో 110 కేంద్రాలను గుర్తించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో గొడవలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ఎన్నికలకు 24 గంటల ముందే పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నాం. సిబ్బందికి, ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాం. ఎన్నికల నిర్వహణకు 1500 మంది సిబ్బందిని ఉపయోగించే అవకాశం ఉంది.

పోలింగ్ శాతం పెంపునకు కృషి

ఎన్నికల నిర్వహణలో భాగంగా పటిష్ట చర్యలు చేపట్టాం. ప్రతి మండలంలోని మానటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. 2019 ఎన్నికల్లో పోలింగ్ 75 శాతం నమోదైంది. దానిని అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. ట్రాన్స్‌జెండర్లు, వృద్ధులు, దివ్యాంగులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద వారికి కల్పించే సౌకర్యాలపై వివరిస్తున్నాం. అనుమతులకు మించి రాజకీయ పార్టీల ర్యాలీలు, ప్రదర్శనలు తదితర అంశాలపై సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందిస్తాం.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీలు ప్రచారం, ఎన్నికల సభలు, ర్యాలీల నిర్వహణకు ముందస్తుగా అనుమతి పొందేందుకు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిటర్నింగ్ అధికారి ద్వారా వెంటనే ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీస్, అగ్నిమాపక, ఆర్టీవో ఫోన్లకు సమాచారం వెళుతుంది. వారు పరిశీలన అనంతరం 48 గంటల్లో అనుమతులు జారీ చేస్తాం.అనుమతి పొందిన రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రచారం నిర్వహించాలి. లేకుంటే వీటికి సంబంధించి సర్వైలెన్స్ టీంలు చిత్రీకరించిన వీడియోలను ఎన్నికల సంఘానికి పంపిస్తాం. వాహన ర్యాలీలు, జెండాలు, అనుమతికి మించి ఉంటే అభ్యర్థి ఖర్చు ఖాతాలో కింద చూపిస్తాం.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్

ఓటుహక్కులేని 18వేల మంది పీవీటీజీలకు ఫారమ్ 6 ద్వారా ఏడాది క్రితం చేపట్టిన ఓటర్ల నమోదు ప్రత్యేక డ్రైవ్‌లో ఓటర్లుగా నమోదు చేశాం. వీరిలో 60 ఏళ్ల దాటిన వాళ్ల కూడా ఉన్నారు. అరకు నియోజకవర్గంలోని నాలుగు వేల మంది పీవీటీజీలను కొత్త ఓటర్లుగా నమోదు చేశాం. నియోజకవర్గంలో 28,500 కొత్త ఎపిక్ కార్డులను ఎన్నికల సంఘం జారీ చేసింది. పెదబయలు మండలంలోని ఇంజరి, గిన్నెలకోట పంచాయతీల్లో 7500 ఎపిక్ కార్డులను సిబ్బంది పంపిణీ చేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


గ్రామాల్లో పర్యటిస్తున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం


జర్రకొండలో గ్రామస్తులతో నాయకులు


నక్కలమెట్టలో పర్యటిస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకలు అందించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ప్రత్యేక కృషి చేసిందని వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం చెప్పారు. మండలంలోని తాంగులగుడలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను జగనన్న ప్రభుత్వం అమలుచేసిందన్నారు. గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వం సేవలదించి దేశానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. టీడీపీ నాయకుల మోసపూరిత హామీలను ఎవరూ నమ్మవద్దన్నారు. గత టీడీపీ పాలకులు జన్మభూమి కమిటీ పేరుతో, పసుపు కుంకుమ పేరుతో దోచుకొని ప్రజలకు మోసం చేశారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్న జగనన్నకు అందరూ అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు శత్రుగున్, నాయకులు శెట్టి అప్పాలు, విజయ్‌కుమార్, పూర్ణ, రామ్మూర్తి , హరి, నాగేశ్వరరావు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని జర్రకొండ, సిసాయిపనుకు, గేదేలాపాడు, గనిక, డి.గ్రపల్లి, తోటమామిడి గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు, నాయకులు సదాశివరాజు, సింహాచలం, రాజారావు, సర్పంచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి సబ్ డివిజన్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ప్రధాన రాజకీయ పార్టీలతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి శుక్రవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు ఎన్నికల నియామవళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి మూడు రోజుల ముందుగానే స్థానిక పోలీసుస్టేషన్‌లో అనుమతులు తీసుకోవాలని సూచించారు. లౌడ్‌స్పీకర్లు వాడే సమయంలో సౌండ్ తక్కువగా పెట్టాలని, ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలు, గొడవలు, ఘర్షణలకు తావులేకుండా అన్ని రాజకీయ పార్టీలు జాగ్రత్తలు పాటించాలని, ఎన్నికల నియామవళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రాత్రిళ్లు యువకుల పహారా


మినుములపుట్టులో కాపాలా కాస్తున్న యువకులు

ముంచంగిపుట్టు: మండలంలో గడిచిన కొద్ది రోజులుగా రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తుల సంచారం, పలుచోట్ల దొంగతనాలు జరుగుతూ ఉండడంతో గిరిజన గ్రామాల్లో యువకులు అప్రమత్తమయ్యారు. మాకవరం, ముంచంగిపుట్టులలో ఇటీవల దొంగలు బీభత్సం సృష్టించడంతో పాటు పలు గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు తిరుగుతూ ఉండడంతో ముంచంగిపుట్టు, సుజనకోట, మినుములపుట్టు, కొత్తసుజనకోట, కించాయిపుట్టు, దశరిపుట్టు, కిలగాడ గ్రామాల్లో రోజుకు కొంతమంది చొప్పున యువకులు రాత్రి నుంచి ఉదయం వరకు పహారా కాస్తున్నారు. దొంగతనాలు తగ్గుముఖం పట్టేంత వరకు గ్రామాల్లోకి బయట వ్యక్తులు రాత్రిపూట రావద్దని కోరుతున్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం తెలియజేయాలని ఎస్‌ఐ రవీంద్ర అన్నారు.దొంగతనాల భయంతో గ్రామాల్లో బయట వ్యక్తులు వస్తే ఎటువంటి దాడులు చేయవద్దని సూచించారు. వివరాలు తెలుసుకొని, అనుమానాస్పదంగా భావిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక నిఘా సైతం ఉంచామని గ్రామస్తులు ఆందోళన చెందవద్దన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన


ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

రంపచోడవరం: రంపచోడవరం డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను ఎన్నికల విధుల్లో వినియోగించుకుంటామని రంపచోడవరం సీఐ వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వలంటీర్లు 30 మందిని ఎంపిక చేసి, డ్యూటీ నిమిత్తం చేయవలసిన పనుల గురించి వివరించారు. అధ్యాపకులు వెంకటేష్ తదితరులున్నారు.

పది పరీక్షకు 18 మంది గైర్హాజరు

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగిలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం జరిగిన పదో తరగతి లెక్కల పరీక్షకు 18 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ సూరయ్యరెడ్డి తెలిపారు. వీరిలో ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులు, 15 మంది ప్రయివేటు విద్యార్థులు వున్నారన్నారు. మొత్తం 467 మందికి గాను 449 మంది విద్యార్థులు మాత్రమే హాజరై పరీక్ష రాసినట్టు ఎంఈఓ తెలిపారు. కాగా ఏజెన్సీ డీఈఓ వై. మల్లేశ్వరరావు , డీటీ సుధాకర్‌లు జడ్డంగి, సింగంపల్లి పరీక్షా కేంద్రాలను తనిఖీ నిర్వహించారు.

ఘనంగా అన్నసమారాధన

సీలేరు: స్థానిక శివాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న శివపార్వతుల కల్యాణ వేడుకలో మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం శివ పార్వతులకు కుంకుమ పూజలు ,అభిషేకాలు నిర్వహించారు.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసామని తెలిపారు.

ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ


ఓటరు గుర్తింపు కార్డులు చూపిస్తున్న గ్రామస్తులు


ఓటరుకు గుర్తింపు కార్డు అందజేస్తున్న బీఎల్వో

చింతపల్లిరూరల్: ఎన్నికల కమిషన్ నుంచి మండలానికి జారీ అయిన ఎపిక్ ఓటరు కార్డులను పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ చెప్పారు. మండలంలోని 78 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి శుక్రవారం 10,206 ఓటరు కార్డులు పంపిణీ చేశామన్నారు.

అడ్డతీగల: ఎన్నికల కమిషన్ నుంచి 2,016 ఎపిక్ కార్డులు జారీ అయినట్టు తహిసీల్దార్ పి.నాగమణి చెప్పారు. మండల వ్యాప్తంగా ఉన్న 42 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోల ద్వారా కార్డులను ఓటర్లకు పంపిణీ చేస్తున్నట్టు ఆమె చెప్పారు.

రాజవొమ్మంగి: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన వారికి ఎన్నికల కమిషన్ మంజూరు చేసిన ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు కార్డులను అందజేస్తున్నారు. మండలానికి 3148 గుర్తింపు కార్డులు వచ్చినట్టు తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ చెప్పారు.

క్షయపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని ఉప్ప ఆస్పత్రి నుంచి ఉప్ప కేంద్రం వరకు క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సూపర్‌వైజర్ సదానందం, సిబ్బంది నాగేశ్వరరావు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు


లబ్బర్తి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ వెంకయ్య

రాజవొమ్మంగి: మండలంలోని పలుచోట్ల స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ వెంకయ్య తమ సిబ్బందితో శుక్రవారం ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రయాణికుల లగేజీని సోదా చేస్తున్నారు. మావోయిస్టులు ఎన్నికలను బహిష్కరిస్తు పిలుపునిచ్చిన నేపథ్యంలో సాయుధ పోలీసులు ఎన్‌హెచ్ 516ఈ పొడవునా తంటికొండ నుంచి శరభవరం వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర గస్తీ నిర్వహించారు. కల్వర్టులు, ఇరుకు తూముల వద్ద ఏవైనా మందు పాత్రలు ఉన్నాయా అని పరిశీలించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా సాయుధ పోలీసు దళాలు నిఘా పెంచాయి.

నీటి సంరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులప్రదర్శన

యలమంచిలి రూరల్: జీవరాశి మనుగడకు నీరే ఆధారమని, నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మున్సిపల్ కార్యాలయ అధికారులు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. సేవ్ వాటర్ సేవ్ నేచర్ అంటూ నినాదాలు చేశారు.బ్యానర్లు ప్రదర్శించి స్థానికులకు జలసంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నీటికొరత ఒకటన్నారు. బెంగళూరు సిటీలో నీటి సంక్షోభంతో జలదినోత్సవానికి ప్రాధాన్యత ఏర్పడిందని చెప్పారు.అనంతరం న్యాయస్థానాల ప్రాంగణం వద్ద అవగాహన సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు,పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు, న్యాయవాదులు, మునిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: నీటి వనరులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. ఎన్నికల కోడ్ అమలు తీరు పరిశీలనలో భాగంగా ఆయన వమ్మవరం మోడల్ ప్రైమరీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవంలో ఆయన పాల్గొని, విద్యార్థులతో పాటు నీటి వనరుల పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, బోధన తీరుపై ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు పాల్గొన్నారు.

నాటు తుపాకీలు అప్పగించండి


ఎస్‌ఐ సాయికుమార్

వై.రామవరం: జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహల్లి ఆదేశాల మేరకు మండలంలోని గుర్తేడు పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎవరివద్దనైనా నాటు తుపాకులు గాని, లైసెన్స్ లేని ఏవిధమైన ఆయుధాలుగాని ఉన్నట్లైతే సంబంధిత పోలీసు స్టేషన్‌లో స్వచ్ఛందంగా అప్పగించాలని గుర్తేడు ఎస్‌ఐ సాయికుమార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. అప్పగించకుండా ఎవరైన లైసెన్స్ లేని ఆయుధాలతో పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎవరైన అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నట్టు సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తే వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. దీంతో స్పందించి ఇచ్చిన గడువులోపు ఆయుధాలను పోలీసు స్టేషన్‌కు అప్పగిస్తే ఏవిధమైన కేసులు ఉండవని ఎస్‌ఐ సాయి కుమార్ తెలియజేశారు.

సోలార్ లైట్ల పంపిణీ


సోలార్ లైట్లను పంపిణీ చేస్తున్న పోలీసులు

సీలేరు: సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రొగ్రామ్ ద్వారా శుక్రవారం సీలేరు పోలిస్ స్టేషన్ పరిధిలో వలసపల్లిలో గ్రాస్తులకు సోలార్ లైట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కమాండెంట్ సురేష్‌బాబు మాట్లాడుతూ గిరిజనులు అభివృద్ధి చెందాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, గంజాయి సాగు, రవాణా చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా 30 ఇళ్లకు ఈ సోలార్ లైట్లను అందజేశారు. సీఐ అప్పలనాయుడు, ఇన్‌స్పెక్టర్ సుభేష్ కెడి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బుచ్చెయ్యపేట : వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం సదస్యం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవితో వేంకటేశ్వరస్వామికి కల్యాణం జరిగి మూడో రోజు కావడంతో రాత్రికి వడ్డాది పుర వీధుల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గజగరుడ వాహనాలపై ఉంచి డప్పులు, వాయిద్యాల ఊరేగించారు. గిరిజాంబ కొండపై ఉత్సవ విగ్రహాలను ఉంచారు. తిరువీధి ఉత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామిని స్తుతించారు. దీంతో గోవింద నామస్మరణ మార్మోగింది. కల్యాణ వేడుకల్లో భాగంగా నాల్గో రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడానికి దేవస్థానం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.